క్లుప్తంగా

వీరేశ్వరస్వామి ట్రస్ట్‌కు విరాళం



దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు గుడివాడ గ్రామానికి చెందిన గోపిశెట్టి ఇంద్ర సాయికుమార్ కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళంగా ఇచ్చారు. సదరు మొత్తాన్ని ఆలయ పర్యవేక్షణధికారి బి.వీరభద్రరావుకు శనివారం అందజేశారు. దాతలను ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. తొలుత దాత కుటుంబీకులకు ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం అందించారు. స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

పాఠశాలల్లో సీఎంఓ ఆకస్మిక తనిఖీలు



తాళ్లరేవు హైస్కూల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను కాకినాడ జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజ్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంతో పాటు సెమిస్టర్–2 పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. తాళ్లరేవు హైస్కూల్ హెచ్‌ఎం ఆశాలత, సీఆర్‌పీ తరాల మీరాసాహెబ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు మరిడమ్మ అమ్మవారి తీర్థం



సీతారామపురంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లరేవు: మండలంలోని సీతారామపురం గ్రామదేవత మరిడమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం జరగనుంది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో హోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు కందికొండ భాస్కరశర్మ నేతృత్వంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాల నడుమ అమ్మవారి జాతర ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ టి.లక్ష్మణరావు, పెమ్మాడి కాశీవిశ్వనాథ్, అత్తిలి బాబూరావు, మందా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 85 రద్దు చేయాలి



జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

ముమ్మిడివరం: ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 85 రద్దు చేయాలంటూ ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం ముమ్మిడివరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కరోనా, ప్రకృతి వైపరీత్యాల్లో ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించిన వైద్యుల కెరీర్‌కు అవరోధంగా ఉన్న జీఓ 85ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో కోనసీమ జిల్లాకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

ఆవు దూడపై కుక్కల దాడి



చల్లపల్లిలో కుక్కల దాడిలో గాయపడిన ఆవుదూడ

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో పాడిరైతు పోలిశెట్టి అయ్యప్ప తన ఇంటి ఆవరణలో కట్టిన ఆవు దూడపై శనివారం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. నిత్యం వీధికుక్కలు స్వైరవిహారం చేసి స్థానికులు, పశువులపై దాడి చేస్తున్నాయని పాడి రైతు ఆవేదన వ్యక్తం చేశారు. చల్లపల్లి గ్రామంలో రోడ్ల పక్కనే చెత్తను పాడేస్తుండడం, అధికారులు పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడంతో ఎక్కడెక్కడి వీధికుక్కలో ఇక్కడికే వచ్చి ఎక్కువగా గుమిగూడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు కుక్కల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కుయ్యో.. రొయ్యో..

- వాతావరణ మార్పులతో బెంబేలెత్తిస్తున్న వైరస్‌లు
- హడలిపోతున్న ఆక్వా రైతులు



చల్లపల్లిలో చిన్న కౌంట్‌లోనే పట్టుబడి పట్టిన వెనామీ రొయ్యలు

ఉప్పలగుప్తం: రొయ్య సాగు చేసే ఆక్వా రైతుకు జూన్ నుంచి డిసెంబర్ వరకూ సాగు కత్తి మీద సాము లాంటిదే. ఈ పరిస్థితిల్లోనే కొంతమంది రైతులు సాగుకు విరామం ప్రకటిస్తుంటారు. మరి కొందరేమో వాతావరణం రీత్యా ప్రమాదమని తెలిసినా గంపెడాశలతో ప్రకృతిపై రైతులు పూర్తి నమ్మకాన్ని పెట్టుకుని సాగు సాగిస్తున్నారు. అయితే ప్రస్తుత వాతావరణంలో వస్తున్న మార్పులకు ఆక్వా రైతులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మళ్లీ కొద్దిరోజులుగా భానుడు ఉగ్రరూపం చూపిస్తుండడంతో చెరువుల్లోని రొయ్యలు ఉష్ణోగ్రతలను తట్టుకోలేక వైరస్‌లతో చిన్న సైజులోనే మృత్యువాత పడుతున్నాయి. కొంత మంది రైతులు లాభాల దిశగా చేప, రొయ్య మిశ్రమ సాగు(పాలీకల్చర్) చేస్తున్నా రొయ్య సాగు రోజులు గడవకముందే కొత్త కొత్త తెగుళ్లతో చిన్న కౌంట్‌తోనే చనిపోవడంతో నష్టాలను చూస్తున్నారు.

అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్ళరేవు, అమలాపురం మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు, ప్రస్తుతం కాస్తున్న ఎండలకు చెరువు నీటి, మట్టి నాణ్యత లోపించడం, ఆక్సిజన్ స్థాయి తగ్గడం, డెడ్ ఆల్గే, విషవాయువులు విజృంభించడంతో వెనామీ రొయ్యల సాగులో వైట్ గట్, సెల్ లూజ్, రెడ్ గిల్, బ్లాక్ గిల్, హిబ్రియో వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిశ్రమ పద్ధతిలో రొయ్యలు, చేపల సాగులో రొయ్యసాగు కలిసి వస్తే దానిపై వచ్చే ఆదాయం పెట్టుబడులుగా వచ్చి, చేపల సాగుపై వచ్చే ఆదాయం రైతుకు లాభదాయకంగా ఉంటుంది. కానీ ప్రస్తుత పరిస్థితిల్లో రొయ్య సీడ్ నుంచి ఈహెచ్‌పీ అనే వ్యాధి రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో రొయ్య మేత ఎక్కువగా తీసుకుని ఎదుగుదల లోపించడంతో రైతులు నష్టపోతున్నారు. సమయానుకూలంగా సాగును పరిశీలించుకుని శానిటైజర్స్, మందులు వాడుతూ అధికంగా ఏరియేటర్లను తిప్పుతూ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



వాతావరణంలో వస్తున్న మార్పులకు రొయ్య సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నేను 8 ఎకరాల్లో చేప, రొయ్య మిశ్రమ సాగు చేస్తున్నాను. రొయ్యకు ప్రతిసారి ఈహెచ్‌పీ వ్యాధి సోకుతుంది. దీంతో పాటు వాతావరణ మార్పులతో వైరస్‌లు సంభవించడంతో పంట చేతికి రావడం లేదు. చేపకు వచ్చే లాభం రొయ్య తీసుకుని వెళ్లడంతో సాగు చేసే ప్రతిసారి నష్టపోతున్నాను.

– పినిపే జయరాజు, ఆక్వా రైతు, చల్లపల్లి, ఉప్పలగుప్తం మండలం

హేచరీల వైఫల్యంతో నష్టపోతున్నాం



హేచరీల నిర్వాహకులు పూర్వం మంచి నాణ్యత కలిగిన తల్లి రొయ్యలను తెచ్చి దాంతో నాణ్యమైన పిల్లలను అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నాసిరకమైన తల్లి రొయ్యలను వాడి నాసిరకమైన రొయ్య పిల్లలు ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు దృష్టి సాగించి హేచరీలపై చర్యలు తీసుకోవాలి.

– చెదల్ల వాసుదేవుడు, ఆక్వా రైతు, సామంతకుర్రు, అల్లవరం మండలం

రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయాలి



కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ పనులపై చర్చిస్తున్న కేఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే ప్రాజెక్ట్‌కు కేంద్రం విడుదల చేస్తున్న నిధులకు తోడు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా నిధులు కూడా విడుదల చేస్తే రైల్వే లైన్, వంతెన పనులు మరింత వేగం పుంజుకుంటాయని కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్‌ఎస్) స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక కేఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో స్టీరింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో రైల్వే పనుల ప్రగతిపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదలకు కోనసీమకు చెందిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కేఆర్‌ఎస్ఎస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రైల్వే పనులను వేగవంతం చేస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ కృషికి హర్షం వ్యక్తం చేశారు. అమలాపురం సర్క్యులర్ బజార్‌లో గతంలో ఉన్న రైల్వే కౌంటర్‌ను తిరిగి ప్రారంభించాలన్నారు. సమావేశంలో కేఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, పోలిశెట్టి శివాజీ, ఎరగర్త వెంకటేశ్వరరావు, వంకాయల రాజా పురుషోత్తం, జీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల మోకాలికి శస్త్ర చేయించుకున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఇంటికి కేఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు వెళ్లి పరామర్శించారు.

ఘనంగా నిమజ్జనం



గాడిలంక వరసిద్ధి వినాయక ఆలయంలో లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న భక్తుడు

ముమ్మిడివరం: చవితి మహోత్సవాల్లో బాగంగా శనివారం మహాగణపతి నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం మార్కెట్ సెంటర్, పల్లిపాలెం, గాడిలంకతో పాటు పలు గ్రామాల్లో స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి ఊరేగింపుగా వృద్ధ గౌతమి గోదావరి పాయకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గాడిలంక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో స్వామివారికి సమర్పించిన లడ్డూను గ్రామానికి చెందిన పళ్ల దుర్గారావు రూ.99,000కు దక్కించుకున్నారు. ముమ్మిడివరం సుంకర వారి వీధిలో శ్రీవిజయ గణపతి స్వామికి సమర్పించిన లడ్డూను వేలం వేయగా గ్రామానికి చెందిన పోలిశెట్టి అయ్యన్న, పోలిశెట్టి కృష్ణలు రూ.14,116కు కైవసం చేసుకున్నారు.

గ్యాస్ లీకేజీపై ఆందోళన చెందొద్దు



ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం శివారు దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూములకు సమీపంలో ఏర్పడిన గ్యాస్ లీకేజీపై ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గోదావరి నదీ గర్భంలో వేసిన గ్యాస్ పైపులైను లీకేజీ అవుతుందనే సమాచారం తనకు రావడంతో సంబంధిత ఓఎన్‌జీసీ అధికారులు, అమలాపురం ఆర్డీవో తదితరులతో మాట్లాడానన్నారు. గ్యాస్ లీకేజీని కొద్దిరోజుల క్రితం ఓఎన్‌జీసీ సిబ్బంది గమనించి అదుపులోకి తీసుకొచ్చారని, ప్రస్తుతం ఆ పైపు నుంచి గ్యాస్ లీకేజీ అవ్వడం లేదన్నారు. తనిఖీ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించి ప్రస్తుతం వస్తున్నది గ్యాస్ కాదని నీటి బుడగలేనని తెలిపారన్నారు. గ్యాస్‌లీకేజీ అవుతున్న ప్రదేశానికి వెళ్లి ప్రభుత్వానికి తెలియజేసిన యువకులను ఆయన అభినందించారు.

ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు దిష్టి బొమ్మ దహనం

అమలాపురం రూరల్: పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఏలూరుపాడు గ్రామంలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అంబేడ్కర్ బ్యానర్ చించేయడాన్ని నిరసిస్తూ శనివారం అమలాపురం మండలం నడిపూడి నక్కావారి పేటలో దళిత నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. వెంటనే రఘురామ కృష్ణంరాజును అరెస్టు చేయాలని, ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దళితులంతా ఆయనకు తగిన గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషక విలువలతో భోజనం అందించాలి

కలెక్టర్ మహేష్ కుమార్



బండారులంక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం కింద పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంప్రదాయాలు, విద్యార్థుల ఇష్టాయిష్టాలు, ఆహార అలవాట్ల ప్రకారం భోజనం ఏర్పాట్లకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. పిల్లలందరూ ఇష్టపడి భోజనం చేసేలా డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన ఏర్పాట్లు ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. పోషకాహార లోపాన్ని నివారించడానికి, బడికి వస్తున్న పిల్లల సంఖ్యను పెంచేందుకు, పిల్లల మధ్య సామాజిక బంధాలను మెరుగుపరిచేందుకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో పలు మార్పులు వచ్చాయన్నారు. విద్యా బోధనతో పాటు పాఠశాల నిర్వహణ, వేస్ట్ మేనేజ్‌మెంట్, శానిటేషన్, వాటర్ సదుపాయం, హ్యాండ్ వాష్ ప్రక్రియ వంటి అంశాలపై కూడా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిలబస్ ఏ మేరకు పూర్తయిందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

23న సురక్షా శిబిరాలు

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23వ తేదీన సఫాయి మిత్ర సురక్షా వైద్య శిబిరాలు ఏడు ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ, కార్మిక శాఖ అధికారులతో శిబిరాల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల పరిధిలోని పారిశుధ్య కార్మికులకు పూర్తిస్థాయి హెల్త్ చెకప్‌లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి కార్తీక్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి దుర్గారావు దొర, కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి. నాగలక్ష్మి, డీఐఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా పేకాట క్లబ్ నిర్వహణ

యానాం: యానాం పట్టణం నడిబొడ్డున పోలీస్‌స్టేషన్ వెనక ఉన్న కల్యాణ మండపంలో సూర్య సొసైటీ రిక్రియేషన్ క్లబ్ పేరిట పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. క్లబ్‌ను వెంటనే మూసేయాలని పలువురు యువకులు సంబంధిత నిర్వాహకులతో వాగ్వాదానికి దిగడంతో ఈ వ్యవహారం బయటకొచ్చింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిసర ప్రాంతాలతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి పలువురు కార్లలో యానాం వచ్చి క్లబ్‌లో పేకాట ఆడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రోజుకు సుమారు రూ.40 లక్షల మేర లావాదేవీలు జరుగుతున్నాయంటున్నారు. తక్షణం క్లబ్‌ను తొలగించాలని పాలనా యంత్రాంగానికి యువకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణను వివరణ కోరగా పేకాట క్లబ్‌ను మూసి వేయాలని ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు ఇచ్చామన్నారు.

నేడు మల్లాడి ధర్నా

యానాం: యానాం పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో సూర్య రిక్రియేషన్ క్లబ్ పేర నిర్వహిస్తున్న పేకాట క్లబ్ మూసివేతకు ఆ క్లబ్ ఎదుట ఆదివారం సాయంత్రం ధర్నా నిర్వహించనున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రాయల్ క్లబ్‌ను మూయించి వేశామన్నారు. అయితే సుప్రీం కోర్టులో రాయల్ క్లబ్‌పై విచారణ జరుగుతుందని స్థానిక కోర్టుకు విన్నవించడంలో విఫలమవడంతో మళ్లీ వారం రోజులుగా సూర్యక్లబ్ తెరవడానికి దారి తీసిందన్నారు. పేకాట క్లబ్ ద్వారా పలువురు పోలీసులకు మామూళ్లు వెళుతున్నాయని ఆరోపించారు. ఆదివారం తాను నిర్వహించనున్న ధర్నాకు ప్రజలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

ముమ్మిడివరం కమిషనర్‌గా రవివర్మ

కాకినాడ: ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్‌గా పి.రవివర్మ నియమితులయ్యారు. ఈ మేరకు పురపాలన శాఖ నుంచి శనివారం ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆయన కాకినాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. గతంలో కూడా పి.రవివర్మ ముమ్మిడివరం కమిషనర్గా పనిచేశారు.

మహిళ మృతదేహం లభ్యం



బయ్యవరపు నాగసాయి(ఫైల్)

ముమ్మిడివరం: క్రాప చింతల పూడి గ్రామానికి చెందిన బయ్యవరపు నాగసాయి(56) గురువారం అదృశ్యమైంది. ఆమె మృతదేహం శనివారం మురమళ్ల వృద్ధ గౌతమి నదీపాయలో లభ్యమైంది. క్రరివా నిరేవు పెన్నాడవారిపాలెం సమీపంలో గోదావరి పాయలో ఆమె మృతదేహం కనిపించింది. మృతురాలి మనమడు పెన్నాడ తేజ సాయి సంతోష్ ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ఎస్‌హెచ్‌ఓ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెకు భర్త రంగారావు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పెట్రోల్‌బంకులో విజిలెన్స్ తనిఖీలు

యానాం: నియోజకవర్గ శివారు యానాం–సావిత్రి నగర్ రహదారిలో ఆర్‌ఐటీ సమీపంలో అడివి పాలెం గ్రామంలో నిర్వహిస్తున్న నయారా పెట్రోల్ బంకులో శనివారం రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమండ్రి విజిలెన్స్ ఎస్పీ పెట్రోల్‌బంకులో ట్యాంకర్ల ద్వారా వస్తున్న డీజిల్, పెట్రోల్ నిల్వలు, అమ్మకాలను తనిఖీ చేశారు. దీనిపై స్పందించడానికి విజిలెన్స్ ఎస్పీ నిరాకరించారు.

దశలవారీగా అమలుచేస్తాం

అల్లవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వంద నిర్ణయాలు తీసుకున్నారని, వాటిని దశల వారీగా అమలు చేస్తామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. దేవగుప్తం ఉన్నత పాఠశాల ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆనందరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లవరం మండలంలో తాగునీటి కొరత ఉందని, నీటిని నిల్వ చేయడానికి చెరువుల అవసరం ఉందన్నారు. దేవగుప్తం ఉన్నత పాఠశాలలో రూ.5 లక్షలతో సైకిల్ స్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ నరసింహరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సముద్ర తీరాలను పరిరక్షించుకోవాలి



చిర్రయానం సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న విద్యార్థులు



ఓడలరేవులో స్వచ్ఛ సాగర్, సురక్ష సాగర్ కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

యానాం: సముద్ర తీర ప్రాంతాలను పరిరక్షించుకోవడం ద్వారా జీవవైవిధ్యాన్ని, జీవజాతులను పరిరక్షించిన వారమవుతామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో రామచంద్రాపురం కృత్తికంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీకళాశాల, రేడియో అల 90.8 ఎఫ్‌ఎంల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ బీచ్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తీరంలో 190 కేజీల వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాస్, ఎఫ్ఎం రేడియోస్టేషన్ డైరెక్టర్ సత్యవతి, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఫణీంద్ర, ప్రిన్సిపాల్ కె.సత్యలత, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

కాట్రేనికోన: ప్రపంచ తీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌కు చెందిన కాయిస్ స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర మత్స్యకార సేవా సంఘం సభ్యులు చిర్రయానం సముద్ర తీరం వెంబడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులతో కలసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్ర జలాలు కలుషితమవుతున్నాయన్నారు. చేపల వేటకు పనికి రాని ప్లాస్టిక్ వలలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్ర జలాల్లో పడేయంతో వాటిని ఆహారంగా తీసుకున్న జలచరాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో అంగాని నరసింహమూర్తి, కర్రి కాసుబాబు, లోవరాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లవరం: జాతీయ సముద్ర తీర పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఓడలరేవు తీరంలో స్వచ్ఛ సాగర్– సురక్ష సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకారులు, విద్యార్థులు తీరం పొడవునా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, ఉమామహేశ్వరరావు, మెరైన్ సీఐ మూర్తి, బీవీసీ ప్రిన్సిపాల్ చంద్రమౌళి రవిచంద్ర, ఎఫ్‌డీఓ అశ్విని, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్వచ్ఛతాహి సేవలో భాగంగా అమలాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో స్వభావ స్వచ్ఛత–సంస్కార స్వచ్ఛత కార్యక్రమం శనివారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియారం స్తంభం సెంటరులో 'పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుతాం' అంటూ అందరూ ప్రతిజ్ఞ చేసి మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ డీఈఈ సీహెచ్ నాగసతీష్, మేనేజర్ మాచిరాజు మూర్తి, మెప్మా సిటీ మేనేజర్ వి.రామలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఇమ్మిడివరప్పాడు పంచాయతీ పరిధిలో సర్పంచ్ రేలంగి దుర్గారావు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతాహి సేవా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో చేసే క్లాప్ మిత్రులకు, సిబ్బందికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పద్మినీకుమార్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలోని హోప్ ఐలాండ్ దీవిలో స్వచ్ఛభారత్, ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డే సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం మెరైన్ ప్లాస్టిక్ చెత్తను శుభ్రపరిచారు. తీర ప్రాంతాల నుంచి సుమారు 300 కిలోల సముద్ర ప్లాస్టిక్‌ను సేకరించారు. కాకినాడ యానిమల్ వారియర్స్, కన్జర్వేషన్ సొసైటీ, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్, ఎఫ్ఎస్ఓలు గౌతం ప్రసాద్, వీరభద్రరావు, ధనుంజయ, గోపి, సంధ్య పాల్గొన్నారు.

బాల గణపతికి పెన్నుల పూజ



దుడ్డివారి అగ్రహారంలో బాల గణపతి

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలో బాల గణపతి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన వినాయక చవితి ఉత్సవాల చలువ పందిరిలో నెలకొల్పిన గణపతి విగ్రహానికి పెన్నుల పూజ శనివారం వైభవంగా జరిగింది. అనంతరం జరిగిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బాల గణపతి విద్యార్థి సంఘం ప్రతినిధులు యల్లమిల్లి నాగసుధాకొండ, అరిగెల తేజ తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రశంసా పత్రాలు అందుకున్న ఇంజినీర్లతో జిల్లా అధికారి అలీముల్లా తదితరులు

అమలాపురం టౌన్: ఇంజినీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి యువ ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి అలీ ముల్లా అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా స్థానిక పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయంలో శనివారం జరిగిన జయంతి కార్యక్రమానికి అలీ ముల్లా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన 35 మంది ఏఈఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లకు జిల్లా అధికారి అలీ ముల్లా, డీఈఈలు అన్యం రాంబాబు, పీఎస్ రాజ్‌కుమార్, భూషణ ప్రసాద్‌లు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఇచ్చిన హామీలను అమలుచేయాలి

అమలాపురం రూరల్: ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని అమలాపురం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాలమూరి బాలకృష్ణ డిమాండ్ చేశారు. సాకుర్రు గ్రామంలో శనివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇచ్చిన హామీలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, మాజీ సర్పంచ్ చొల్లంగి సత్య సాయి బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు



ఎంఎల్‌కే నగర్‌లో ఉత్కంఠగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

తాళ్లరేవు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపికలకు సంబంధించి మండల స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. శనివారం జార్జిపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్ పాఠశాలలో బాలురకు పోటీలు నిర్వహించారు. మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వీకేఆర్ తంబి పర్యవేక్షణలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. మండలానికి చెందిన పీడీలు, పీఈటీల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.

ఉపాధి సామాజిక తనిఖీ

ఉప్పలగుప్తం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్‌రావు ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ పనులపై శనివారం ప్రజావేదిక నిర్వహించి 17వ విడత సామాజిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ 17 గ్రామాల్లో జరిగిన 840 పనులపై ఆరా తీశారు. మండలంలో వేతనాలుగా రూ.8.30 కోట్లు చెల్లించగా, పంచాయతీరాజ్ శాఖ మెటీరియల్ నిమిత్తం రూ.2.30 కోట్లకు సంబంధించి ఆడిట్ నిర్వహించి రూ.67,000 రికవరీ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్ఆర్ సత్యనారాయణ, విజిలెన్స్ అధికారి భీమేశ్వరరావు, ఎస్ఆర్‌పీ బి.దాసు, అంబుడ్స్‌మెన్ ఎ.వెంకట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఏపీవో వి.రాజామణి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్మార్తాగమ అపర విద్వత్సభ

అమలాపురం టౌన్: కోనసీమ వేద శాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సుబ్బారాయుడి చెరువు వద్ద గల బాలాత్రిపుర సుందరీ సమేత చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 3 గంటలకు స్మార్తాగమ అపర విద్వత్సభ జరుగుతుందని సంస్థ కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్ శనివారం తెలిపారు. ఈ విద్వత్సభకు కోనసీమ వ్యాప్తంగా దాదాపు 200 మంది స్మార్తాగమ అపర పండితులు హాజరవుతారన్నారు.